క్లుప్తంగా

ఎమ్మెల్యే కోన రఘుపతి హర్షం

బాపట్ల: భారత అంతరిక్ష చరిత్రలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఇస్రో పంపించిన చంద్రయాన్-3 జాబిల్లిపై విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ అవడంతో.. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఇస్రోలో రేపల్లె వాసి సేవలు



రేపల్లె రూరల్: చంద్రయాన్-3 ప్రయోగంలో రేపల్లె వాసి పాలుపంచుకున్నాడు. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన పురం శివాజీ, మస్తానమ్మల కుమారుడు పురం సీతారామన్ పదేళ్లుగా ఇస్రో(బెంగళూరు)లో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నారు. చంద్రయాన్-3 ప్రయోగంలో సీతారామన్ సేవలు అందించటంపై పలువురు అభినందనలు తెలిపారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగలతో పాటు పలువురు ప్రముఖులు సీతారామన్‌కు అభినందనలు తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు


రేపల్లెరూరల్: పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ వసతి గృహంలో వంట మనిషిగా పని చేస్తున్న తెనాలి మండలం చినరావూరు గ్రామానికి చెందిన కేతావాత్ చిలికి(60) మృతిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ బుధవారం తెలిపారు. ఈ నెల 21న వసతి గృహంలో చిలికి వంట పనులు చేస్తూ కాలుజారి కిందపడింది. చికిత్స నిమిత్తం గుంటూరులోని వైద్యశాలకు తరలించారన్నారు. చికిత్స పొందుతున్న ఆమె మృతి చెందటంతో కుమారుడు చందూ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

24న చలో విజయవాడ గోడ ప్రతుల ఆవిష్కరణ



రేపల్లె: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొని, జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం చలో విజయవాడ కార్యక్రమ గోడ ప్రతులను ఆవిష్కరించారు. మునిసిపాలిటీ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని అన్నారు. మున్సిపల్ కార్మికులు చలో విజయవాడకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సీఐటీయూ అధ్యక్షులు దనాల శివ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అంచున అగాధం..



కొల్లూరు: భారీ వర్షాల కారణంగా మాగాణి భూములు కుంగి ఏర్పడుతున్న భారీ గోతులతో రహదారుల మనుగడకు ముప్పు పొంచి ఉంది. కొల్లూరు నుంచి క్రాప వెళ్లే కేటీ కాలనీ రోడ్డులో స్థానిక ఈద్గా వద్ద రోడ్డు అంచున భారీ అగాధం ఏర్పడింది. దీంతో రహదారి ధ్వంసమయ్యే ఆకాశం ఉంది. రోడ్ల వెంబడి పంటకాల్వలు, డ్రెయినేజీల కల్వర్టుల వద్ద మెతక భూమి వర్షాల వల్ల కుంగిపోయి సక్రమంగా ఉన్న రోడ్లు కాస్తా దెబ్బతినే ప్రమాదం ఉంది. రోడ్డు అంచుల వెంబడి ఏర్పడిన అగాధాలను గమనించకుండా కిందకు దిగితే.. వాహనదారులకు ప్రమాదం తప్పదు. ఈ అగాధాల కారణంగా రోడ్లు ధ్వంసమవక ముందే అధికారులు స్పందించి, గోతులను పూడ్చి ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు చేపట్టాలని స్థానికులు కోరతున్నారు.

•జయహో.. ఇస్రో..!



రేపల్లె: రామకృష్ణ పబ్లిక్ స్కూలు విద్యార్థుల 'చంద్రయాన్-3' ప్రదర్శన

రేపల్లె: జయహో ఇస్రో..భారత్ మాతాకీ జై.. ఇదే బుధవారం మిన్నంటిన నినాదం. జాబిల్లిపై పరిశోధనకు ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగంలో తుది గట్టం విజయవంతం కావడంతో..ప్రజలు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండ్ రోవర్ సాఫ్ట్ ల్యాండ్ కావడంతో.. సంబరాలు అంబరాన్నంటాయి...



చెరుకుపల్లి : గుళ్లపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు కాటూరు కృష్ణయ్య బ్రదర్స్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బాణసంచా పేల్చి, సంబరాలు



రేపల్లె : ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చంద్రునిపై ల్యాండ్ అవుతున్న ఉప గ్రహాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, పాల్గొన్న హెచ్ఎం ప్రవీణ, ఉపాధ్యాయులు



చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారత్ మాతకు జై.. అంటూ బాపట్ల పాతబస్టాండ్ నుంచి విద్యార్థులు చేపట్టిన ప్రదర్శన

మహిళలపై దాడులు సహించేది లేదు

- చట్టపరంగా కఠిన శిక్షలు పడే విధంగా కృషి
- వేమూరు పోలీస్ స్టేషన్ తనిఖీలో ఎస్పీ వకుల్ జిందాల్



స్టేషన్‌లో సిబ్బందితో ఎస్పీ వకుల్ జిందాల్

వేమూరు: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. వేమూరు పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులకు పాల్పడితే.. నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడే విధంగా పని చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. గంజాయి, ఇతర సాంఘిక కార్య కలాపాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని సూచించారు. గ్రామ సమాచారం ఎప్పటికప్పుడు సేకరిస్తూ పోలీసు స్టేషన్‌కు అందజేయాలన్నారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారులపై ఇసుక డ్రమ్ములను ఏర్పాటు చేసి, పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, వేమూరు సీఐ టి.వెంకటేశ్వరరావు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, ఎస్ఐ జె.నాగరాజు ఉన్నారు.

24 గంటల విద్యుత్ సరఫరా పనులు ముమ్మరం



పిట్టలవానిపాలెం: మండలంలోని నాలుగు గ్రామాలలో త్రీ ఫేజ్, 24 గంటలు విద్యుత్ సరఫరా పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ బుధవారం పిట్టువారిపాలెం గ్రామంలో పనులను పరిశీలించారు. గ్రామంలో 100 విద్యుత్ స్తంభాలు, 6 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

డ్రైవరా..మజాకా..!

- అధికారిగా మారిన ఎంపీడీఓ డ్రైవర్..
- సచివాలయ సిబ్బందికి సూచనలు, దిశానిర్దేశం
- ఓ మహిళా అటెండర్ బదులు ఆమె బంధువు విధుల నిర్వహణ
- దీనిపై గతంలో కలెక్టర్ వెళ్లిన ఫిర్యాదులు
- ఎంపీడీఓ కార్యాలయంపై దృష్టిసారించాల్సిన జిల్లా అధికారులు



సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ డ్రైవర్

పిట్టలవానిపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులు ఎవరో.... అటెండర్‌లు, డ్రైవర్లు ఎవరో ప్రజలకు అర్థం కావడం లేదు. అందుకు ఉదాహరణ బుధవారం పిట్టలవానిపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో సాక్షాత్తూ ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ కారు డ్రైవర్ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తూ సాక్షాత్కరించడం. కార్యాలయానికి వచ్చిన కొందరు ప్రజా ప్రతినిధులు ఈ సన్నివేశాన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. అధికారి స్థానంలో డ్రైవర్ కూర్చుని ఎదురుగా సచివాలయ సిబ్బందికి సూచనలు చేయడం ఏమిటా అని విస్తుపోయారు. అదేవిధంగా గత కొంత కాలంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఓ మహిళా అటెండర్‌కు అనారోగ్యం కారణంగా విధులు నిర్వహించలేకపోవడంతో.. ఆమె ప్రతి రోజూ ఆటోలో వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసి వెళ్తుంటారని, ఆమె బదులుగా వారి బంధువులు వచ్చి పనిచేస్తున్నట్లు స్థానికులు కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ విషయంపై సమాధానం చెప్పకుండా అధికారులు దాటవేస్తున్నారు. అసలు ఎంపీడీఓ కార్యాలయంలో ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదని ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. అటెండర్‌కు బదులు మరో వ్యక్తి విధులు నిర్వహిస్తుండటంతో.. ప్రతి నెలా కొంత మొత్తం మామూళ్ల రూపంలో ముట్టజెబుతున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ విషయాలపై కూతవేటు దూరంలో ఉన్న జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కొందరు ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు కోరుతున్నారు.

టంగుటూరి సేవలు ఎనలేనివి

ఆర్డీవో జగన్నాథం పార్థసారథి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో పార్థసారథి

రేపల్లె: దేశ స్వాతంత్ర సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు యువతకు స్ఫూర్తి ప్రదాత అని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి అని అన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనలో భారతీయులకు ప్రాధాన్యమివ్వని సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో పాటు, అనేక ఉద్యమాలలో ప్రకాశం పంతులు పాల్గొని, దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. స్వాతంత్ర అనంతరం ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రా భివృద్ధికి తన వంతు కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జాన్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ప్రిన్సిపల్ సుధాకరరావు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివప్రసాద్, అధ్యాపకులు శ్రీనివాసరావు, పద్మావతి, బి.జౌహర్ బాబు, అనురాధ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏజీ కళాశాలలో ప్రకాశం పంతులు జయంతి



టంగుటూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీన్ వి.శ్రీనివాసరావు

బాపట్ల: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. టంగుటూరి జయంతిని స్థానిక కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఆశయంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో నిర్ణయాత్మక పాత్ర వహించి, పోరాటాలు ఉన్నచోట ప్రకాశం ఉంటాడు అను కీర్తిని పొందాడన్నారు. ఈ కార్యక్రమంలో డా. కె. శ్రీనివాసులు, డా. బి.విజయాభినందన, డా. డి.వి. సాయిరాం కుమార్, డా. ఎన్.రత్నకుమారి, డా. టి. మధుమతి, డా. కె.ఎస్. శ్రీనివాసులు, డా. వి.మనోజ్ కుమార్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ప్రసాద్

చెరుకుపల్లి: మండల పరిధిలోని గుళ్లపల్లి గ్రామానికి చెందిన కొతరపు రామ్ ప్రసాద్ అనే చేనేత కార్మికుడు ఈ నెల 13న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన కుటుంబాన్ని స్థానిక జెడ్పీటీసీ సభ్యులు మరివాడ పావని భర్త ప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు సూచన మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మృతుడి కుటుంబానికి రూ.10వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ సంఘీయులు భట్టు వెంకటేశ్వరరావు, అందే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



రేపల్లె: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు బస్టాండ్‌లో ఓ వ్యక్తి పడిపోయి ఉండటాన్ని కొంత మంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మృతుని చొక్కా జేబులో చెరుకుపల్లి-రేపల్లె టిక్కెట్ ఉందని, మృతదేహాన్ని మార్చురీకి తరలించామన్నారు. మృతిని బంధువులు ఎవరైనా ఉంటే మృతదేహాన్ని తీసుకెళ్లాని కోరారు.


ఐద్వా పట్టణ కమిటీ కార్యవర్గం ఎన్నిక



ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు

రేపల్లె రూరల్: మోసపోయిన డ్వాక్రా మహిళలను ఆదుకుని వారి సమస్యల పరిష్కారానికి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం పట్టణ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఐద్వా పట్టణ కమిటీ అధ్యక్షురాలిగా షేక్ జహిద్, కార్యదర్శిగా షేక్ ఆశ, గౌరవాధ్యక్షురాలిగా నాగమణి, కోశాధికారిగా షాబానా సుల్తానా, ఉపాధ్యక్షురాలిగా కె.నాంచారమ్మ, గౌసియాను ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. పట్టణంలో ఆర్‌పీల చేతిలో మోసపోయిన డ్వాక్రా గ్రూపులకు న్యాయం జరిగే వరకు ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అన్ని వార్డుల్లో డ్వాక్రా గ్రూపులను విచారించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావటంతో పాటు కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు అందజేత



ఆట వస్తువులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రేపల్లె రూరల్: మండలంలోని విశ్వేశ్వరం, బొబ్బర్లంక, పిరాట్లంక గ్రామాలలోని ఎస్సీ, ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రాలకు చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో మాణిక్యం మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు సైతం సహకారం అందిస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. చిన్నారులకు ఆట వస్తువులు అందజేసిన సంస్థకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివ నాగమల్లేశ్వరరావు, ప్రోగ్రాం మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, సంస్థ క్లస్టర్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ సీహెచ్ రత్న ఏజెంట్, పి.ఆశ, సీఎల్‌సీ వలంటీర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

భట్టిప్రోలు: భట్టిప్రోలు విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థిని రాగం హర్షిత ట్రిపుల్ ఐటీ మూడవ ఫేజ్‌లో ఎంపికైనట్లు హెచ్ఎం ఫణి పార్థసారధి బుధవారం తెలిపారు. హర్షిత పదవ తరగతిలో 583 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున
- నియోజకవర్గ స్థాయిలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం



కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు నాంది అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయిలో గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. పార్టీని బలోపేతం చేసే బాధ్యత కన్వీనర్లు, గృహ సారథులపై ఉందన్నారు. బాధ్యతగా పని చేయాలని వారికి సూచించారు. ఎన్నికలు సమయం దగ్గరకు వస్తోందని, మరలా పార్టీ గెలుపునకు సీఎం వైఎస్ జగన్ సీరియస్‌గా పని చేస్తున్నారని మంత్రి నాగార్జున చెప్పారు. పార్టీ కార్యకర్తల మధ్య చిన్న చిన్న అపోహలు ఉంటే వాటిని పక్కన పెట్టి, పార్టీ గెలుపు కోసం పని చేయాలని స్పష్టం చేశారు. అధికారం ఉంటే ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య తారతమ్యం లేకుండా పనిచేస్తే పార్టీ గెలుపు సాధ్యమని సూచించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ మహిళలందరూ ఒకే తాటిపై ఉంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గెలుపు నల్లేరుపై నడక లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయం కన్వీనర్లు దాది సుబ్బారావు, అన్నపరెడ్డి వీరారెడ్డి, చిన్న బుజ్జి, బి.మోషే, ఎంపీపీలు యల్లమాటి మోహన్, రాపర్ల నరేంద్ర, జాలాది రూబేను, దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీలు దాట్ల సౌజన్య, మూల్పూరు లావణ్య, ఉదయ భాస్కరి, చొప్పర సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, యలవర్తి సురేష్, అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, రామ కృష్ణ, వేమూరు సొసైటీ అధ్యక్షుడు భాను ప్రకాశ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఎస్ఎం క్రాప్ కేర్ బయో ఉత్పత్తుల కంపెనీలో విజిలెన్స్ తనిఖీలు

- ప్రభుత్వ అనుమతులు లేని 11 ఉత్పత్తులు సీజ్
- బోగస్ కంపెనీల పేరుతో ఐదు ఉత్పత్తుల గుర్తింపు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విజిలెన్స్ అధికారులు



సీజ్ చేసిన ఉత్పత్తులతో వ్యవసాయ విజిలెన్స్ ఏవో వాసంతి, సిబ్బంది

కర్లపాలెం: యాజలి గ్రామంలోని వీఎస్ఎం క్రాప్ కేర్ బయో ఉత్పత్తుల తయారీ కంపెనీలో విజిలెన్స్ అధికారులు బుధవారం మెరుపుదాడులు చేశారు. అనుమతులు లేని 11రకాల బయో ఉత్పత్తులను గుర్తించి, సీజ్ చేశారు. ఫేక్ అడ్రస్సులతో ఉన్న మరో ఐదు రకాల బయో ఉత్పత్తులను గుర్తించారు. సుమారు రూ.32.61లక్షల విలువ చేసే బయో ఉత్పత్తులను సీజ్.ఈ సందర్భంగా వ్యవసాయ విజిలెన్స్ అధికారి జె.వాసంతి వివరాలు వెల్లడించారు. యాజలిలో వీఎస్ఎం క్రాప్‌కేర్ కంపెనీలో నకిలీ బయో ఉత్పత్తులు తయారు చేస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్ఐ ఎం.రామచంద్రయ్యతో కలసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అనుమతులు లేని 11 రకాల బయో ఉత్పత్తులను, ఫేక్ అడ్రస్‌లతో తయారు చేస్తున్న మరో ఐదు రకాల బయో ఉత్పత్తులను గుర్తించి సీజ్ చేశామని వెల్లడించారు. 8,578 కేజీల ముడి సరుకును గుర్తించామని వీటి విలువ రూ.32.61లక్షల వరకు ఉంటుందని ఆమె తెలిపారు. వీఎస్ఎం క్రాప్‌కేర్ బయో ఉత్పత్తుల తయారీ కంపెనీ యాజమాన్యం నాలుగు రకాల ప్రొడక్స్ తయారు చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుతులు తీసుకుందని తెలిపారు. ముడి పదార్థాలను సీజ్ చేసి, కర్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రయ్యతో పాటు కర్లపాలెం ఏవో సుమంత్‌కుమార్, ఏఈవో భాగ్యలక్ష్మి, వీఏఏ గోపి పాల్గొన్నారు.